# పుత్రోత్సాహము తండ్రికి...

**-డా. తాడేపల్లి పతంజలి**

**మా** పెద్దవాడు పెళ్ళి చేసుకోనని భీష్మించుకు కూర్చోవటం మా కుటుంబంలోని వారందరికి పెద్ద సమస్యగా మారింది. వయస్సు కారణమా అంటే మొన్ననే ఇరవై ఆరు వెళ్ళి ఇరవై ఏడు వచ్చింది. ఆధునిక యుగానికి తగినట్లుగా కంప్యూటర్ కోర్సులు చెడామడా చదివేసి, రెండు చేతులా సంపాదించే మంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం వెలగబెడుతున్నాడు.

పోనీ- బాధ్యతల కోసం సినిమాల్లో చూపించే హీరో మహాత్ముడిలా వద్దంటున్నాడేమో అనుకోవడానికి ఆస్కారమేమీ లేదు. మాకు ఇద్దరు మగపిల్లలే. రెండవ వాడు కూడా అన్నగారి బాటలో నడుస్తూ కంప్యూటర్ కోర్సుని దున్నేస్తున్నాడు. కనుక చెల్లి పెళ్ళి, అక్క పెళ్ళి వంటి బాధ్యతలు మా పెద్దవాడికి లేవు. అయినా పెళ్ళి ఎందుకు వద్దంటున్నాడో ఎంత జుట్టు పీక్కున్నా అర్థమయి చావటం లేదు.

ఒక ఆరు నెలల నుంచి, వాడికి నాకు మధ్య నడిచే సంభాషణలో రెండవ లేదా మూడవ డైలాగ్ "పెళ్ళి". "ప్లీజ్ డాడీ! నాకు పెళ్ళి ఇష్టం లేదని చెబుతున్నానుగా" అంటాడు. "అదేరా! ఎందుకు?" రొటీన్ డైలాగే అడుగుతాను. మౌనమే సమాధానం. మరీ గట్టిగా అడిగితే ఎదురుగా కూర్చోడు. ఆఫీసు నుంచి కావాలని ఆలస్యంగా వస్తాడు.

వాడు నాకు సమాధానం చెప్పకపోయినా, వాడికి చెల్లుబాటవుతోందేమో కాని- నన్ను ఆడపిల్లల తల్లిదండ్రులు సమాధానం చెప్పకపోతే వదలటం లేదు. "వాడు వద్దంటున్నాడయ్యా!" అంటే, "ఏం... ఎందుకు?" అని ఎదురు ప్రశ్న వేస్తారు. ఆ ప్రశ్నకి జవాబు కోసమే నేనేడుస్తున్నానని వాళ్ళకేం తెలుసు? "ఇహ్హిహ్హి..." అని నేను ఏం మాట్లాడలేక పళ్ళికిలిస్తే, వాళ్ళు నావైపు ఒక దీనమైన చూపు చూసి వెళ్ళిపోయేవారు. ఆ చూపు ఒక కొడుక్కి పెళ్ళి చేయలేని నా అసమర్థతపై టార్చిలైటులా అనిపించేది.

నాలుగు లక్షలకు పైగా బేంక్ బేలన్స్, సొంత యిల్లు- ఇలాంటి ఆర్థిక వనరులు ఉండి, చీకూ చింతా లేకుండా ఆనందంగా ఉండవలసిన ఆరోగ్యవంతుడినైన నేను, ఇలా గందరగోళ పరిస్థితిలో ఉండటం నా మీద నాకే జాలి వేస్తోంది.

ఉన్నట్టుండి ఒకరోజు రాత్రి నా భార్య ఒక బాంబు పేల్చింది.

"ఛా... ఊర్కో..." అన్నాను ఆవిడ ఉద్దేశ్యాన్ని ఖండిస్తూ.

"ఏమిటి... ఊర్కోమంటారు... మీ స్నేహితుడు సెక్సాలజిస్టు దగ్గరికి అబ్బాయిని తీసుకెళ్ళి పరీక్ష చేయించండి" మా ఆవిడ ఖండితంగా చెప్పింది.

"నువ్వు మరీ ఎక్కువగా ఊహిస్తున్నావేమో!" సందేహం వెలిబుచ్చాను.

"ఎవరినీ ప్రేమించలేదంటున్నాడు. పెళ్ళి వద్దంటున్నాడు! బహుశా ఈ లోపముందేమోనని భయపడుతున్నాడేమో... డాక్టర్ గారికి చూపించండి..." మా ఆవిడ ఆదేశం జారీ చేసింది.

"కానీ... ఎలాగే... వాడు చిన్న పిల్లవాడు కాడు... ఎలా మా ఫ్రెండ్ దగ్గరికి తీసుకెళ్ళి పరీక్ష చేయించడం?" తికమక పడుతూ అడిగాను.

"నా ఖర్మ... ఏ ఒక్కటి మీకు చేతయి చావదు కదా! ఆడదాన్ని నేను ఏం చెప్పి చావను! మీరే ఎలాగోలా చెప్పి, వాడిని ఒప్పించి, మీ స్నేహితుడికి చూపించి, పెళ్ళికి ఒప్పించి, నాకు కోడల్ని రెండు నెలల్లో తీసుకొని రండి" బిన్ లాడెన్‌ని రెప్పొద్దున్న టిఫిన్‌కు తీసుకురమ్మని చెప్పినంత తేలిగ్గా చెప్పింది మా ఆవిడ.

డబ్బుంటే ఏ సమస్యలూ ఉండవని నా దృఢ విశ్వాసం. అది తప్పని నా పెద్ద కొడుకు నాకు నిరూపిస్తున్నాడు.

తెల్లవారిన తర్వాత అందరం టిఫిన్ చేస్తున్నప్పుడు "ఒరేయ్! జీవన్! ఈవేళ ఆఫీసుకు

సెలవు పెట్టు... ఫోన్ చేసి చెప్పేయ్" అన్నాను.

"ఎందుకు డాడీ! నేను కూడా కాలేజీకి డుమ్మా కొట్టేయనా! ఎక్కడయినా పిక్నిక్‌కి వెళ్తున్నామా?" చిన్నవాడు పావన్ అందుకొన్నాడు.

"ఒరేయ్ పావన్! నోర్ముయ్! నాన్నగారు నిన్నడిగారా! అన్నయ్యని అడిగారు... ఇంకొక గారె వెయ్యమంటావా?" మా ఆవిడ గర్జించింది. "నేను తింటే నీకు బాగుంటుందని తోస్తే వెయ్యి... తిని పెడతాం..." మా ఆవిడ స్థాయిలోనే వాడూ జవాబిచ్చాడు. వాళ్ళిద్దరి ధోరణికి నాతో పాటు, జీవన్ కూడా నవ్వాడు.

"సెలవు ఎందుకు డాడీ!" అన్నాడు కూల్‌గా జీవన్.

"నన్ను తగలెయ్యటానికి..." అని మనస్సులో అనుకొని "పనుందిరా!" అన్నాను. "అదే... ఏం పని..." జీవన్ మళ్ళీ ప్రశ్న.

"ఏరా... నీ తండ్రిని పూర్తి వివరాలు చెబితే కాని చెప్పిన మాట వినవా! ఇదేరా ఇన్నాళ్ళ బట్టి నువ్వు నేర్చుకొన్నది..." పాతకాలపు సినిమాల్లో గుమ్మడి పెద్దరికాన్ని అరువు తెచ్చుకొని అన్నాను. ఏమనుకున్నాడో ఏమో, ఫోన్ చేసి ఆఫీసుకు రానని చెప్పాడు జీవన్.

✧✧✧

కారులో కూర్చున్న తర్వాత "పోనీ... ఇప్పుడైనా చెబుతావా డాడీ..." అన్నాడు జీవన్.

"ఏం లేదురా... నా ఫ్రెండ్ వేణుగోపాల్ లేడూ! చాలా కాలమయింది వాడిని కలిసి వద్దామని..."

"వేణుగోపాల్ అంకుల్ అంటే సెక్స్ సైకాలజీ అంటూ పత్రికల్లో సమాధానాలు వ్రాస్తుంటారే... ఆయనేనా?" జీవన్ ప్రశ్నించాడు.

"ఎలాగయినా నీకు తెలివితేటలు అధికంరా! ఇట్టే అనీన గుర్తు పెట్టుకొంటావ్!" కొడుకుని పొగిడాను.

పొగడ్త ఎదుటివారి మనస్సును మెత్తబరుస్తుంది. అప్పుడు మనకు కావలసినట్టు దానిని వంచుకోవచ్చు.

"ఆయన దగ్గరికి వెళ్ళాలంటే మీరు వెళితే సరిపోయేది కదా! సెలవు పెట్టి నేను రావడం దేనికి... అంతగా అంకుల్‌ని చూడాలంటే ఏ సండేనో వెళ్ళేవాళ్ళం కదా!"

"ఔననుకో... నిన్న ఫోన్ చేస్తే నిన్ను కూడా చూడాలని, వెంట తీసుకురమ్మని చెప్పాడు... పోనీలేరా... నిన్ను చిన్నప్పుడు భుజాలమీద ఎత్తుకొని, ఆప్యాయంగా చూసిన అంకుల్ కోసం ఒకరోజు సెలవు పోతే ఏముంది?"

జీవన్ మాట్లాడలేదు. నెమ్మదిగా వేణుగోపాల్ క్లినిక్‌కు చేరాం. మమ్మల్ని బాగా రిసీవ్ చేసుకొన్న తర్వాత, "అంకుల్ నీతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడుతాడు..." అంటూ బయట కూర్చున్నాను.

బయట పేషంట్లందరిని ఒక అరగంటసేపు ఆపాడు వేణుగోపాల్. సరిగ్గా 35 నిమిషాల తర్వాత జీవన్ సీరియస్‌గా బయటికి వచ్చాడు.

వాడి ముఖం చూడాలంటే తండ్రినయిన నాకే భయం వేసింది.

"వెళ్దామా... డాడీ..." అన్నాడు వాడు భావరహితంగా.

"డాడీ... వస్తాడులేవోయ్... లంచ్ చేసిన తర్వాత పంపిస్తాలే... కావాలంటే నువ్వెళ్ళు..." గేటు దగ్గరికి వచ్చిన వేణుగోపాల్ ఆత్మీయంగా అన్నాడు. జీవన్ మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

అరగంట గదిలో ఏం జరిగిందో, ఏం మాట్లాడుకున్నారో తెలుసుకోవాలని నాకు చాలా కుతూహలంగా ఉంది.

జీవన్ వెళ్ళగానే "ఏమిత్రా? ఏమన్నా

## ఆశ

నీ హృదయంలో నిండి వున్న
నిరాశా తమస్సుల సుడిగుండంలో
కాలం విసిరిన
విచ్చుకత్తులను ఎదుర్కొని
భవిష్యత్ ప్రాంగణంలో
పచ్చని తోరణాలు కట్టి
ఎల్లప్పుడూ స్వాగతం పలుకుతూ
నవజీవనానికి
రాజమార్గం నిర్మించడానికి
అవకాశం కల్పిస్తుంది
ఆశ!

-వై. కె. మూర్తి

తెలిసిందా?" ఆత్రుతగా అడిగాను వేణుగోపాల్‌ని.

"అందరికీ తెలిసిన దాన్ని కొంత మంది పెద్దలు తెలియనట్లు నటిస్తూ- పిల్లవాళ్ళలో ఎవరైనా తెలుసని అంటే, తెలియనట్లు ఉండమని హెచ్చరిస్తుంటారు. ఈ తెలిసీ, తెలియనితనమే ఎయిడ్స్ చీకట్లోకి నెట్టింది..." హాస్పిటల్లోకి నడుస్తూ హాస్యంగా అన్నాడు వేణుగోపాల్.

"ఒరేయ్! నన్ను నీ తెలివితేటలతో చంపక... జరిగింది చెప్పరా నాయనా!" వేణుగోపాల్‌ని కన్సల్టింగ్ రూంలో బతిమాలాను.

"నేను చెప్పటం దేనికి... ఇదుగో... మా ఇద్దరి సంభాషణ క్యాసెట్ చేసాను. ఆ పక్క రూంలో కూర్చొని విను... ఈలోగా పేషంట్లని పంపించి వస్తాను. ఇద్దరం లంచ్‌కి మా ఇంటికి వెళ్దాం...." అంటూ అతని పక్క రూంలోకి నన్ను పంపించాడు.

నర్స్ వచ్చి టేప్ రికార్డర్ సెట్ చేసి, ఆన్ చేసి వెళ్ళింది.

✧✧✧

"ఏమోయ్ జీవన్... గుర్తున్నానా?"

"అదేమిటంకుల్... మీరు మా ఫ్యామిలీ ఫ్రెండ్."

"వెరీ గుడ్... ఎలా ఉన్నావ్?"

"బై గాడ్స్ గ్రేస్... ఐయామ్ ఫైన్..."

"సంతోషం... పార్టీ ఎప్పుడు ఇస్తున్నావ్?"

"ఏ పార్టీ అంకుల్?"

"అదేనోయ్... నీ మేరేజ్ పార్టీ..."

"....."

"ఏమోయ్... మాట్లాడవ్... ఏ వయస్సుకు జరగాల్సిన ముచ్చట ఆ వయస్సులో జరగాలి. నేను నీ తండ్రి లాంటి వాడిని. ఒక ప్రశ్న అడుగుతాను. ఏమి అనుకోకు... అడగమంటావా?"

"మీ యిష్టం అంకుల్"

"ఎనీ ప్రాబ్లమ్?"

"ప్రాబ్లమ్ మీన్స్..."

"అదేనోయ్... మానసికంగా, శారీరకంగా ఏదైనా ప్రాబ్లమ్?"

"అంటే నాకు పూర్తిగా బోధపడటం లేదు."

"చూడు మిస్టర్ జీవన్... మనం చాలా అడ్వాన్స్‌డ్‌గా ఉన్నాం... మిగతా సమస్యలెలాంటివో సెక్స్‌పరంగా ఉండేది కూడా అలాంటిదే... ఒక అందమైన అమ్మాయి తలారా స్నానం చేసి పూలు పెట్టుకొని మంచి డ్రెస్ వేసుకొని నీకు కనబడిందనుకో.... నీకెలా అనిపిస్తుంది?"

"బాగుంది అనుకొంటాను."

"దేర్ యూ ఆర్... అందం బాగుంది అనుకోవటంలో తప్పు లేదు. కాని కనిపించిన అందమల్లా నాది అనుకోవటంలో తప్పు ఉంది... యామై రైట్.?"

"యస్... అంకుల్."

"లస్ట్ ఈజ్ ఆల్సో బయలాజికల్ నీడ్... వయస్సులో ఉన్నవాడివి. ఒక అందమైన అమ్మాయిని చూసినప్పుడు ముద్దు పెట్టుకోవాలని, కౌగిలించుకోవాలని ఇలాంటివేమీ అనిపించవా?"

"మనం జంతువులం కాదు కదా అంకుల్. కనపడ్డ ప్రతిదాని మీద ఎగబాకటానికి"..

"వెరీ గుడ్... అంటే... ఎగబాగటం మంచిది కాదంటే... ఎగబాకాలి అనే మగతనం లక్షణం నీలో ఉంది. దాన్ని నీతి నియమాల కోసం, సమాజం కోసం కట్టడి చేసుకుంటున్నావ్... యామై రైట్?"

"......"

"నీ మౌనాన్ని అర్థాంగీకారంగా... లేదు... లేదు... పూర్ణాంగీకారం అనుకొంటున్నాను. ఓ... కే... నా?"

"ఓ... కే..."

"థాంక్ యూ జీవన్. మరి ఇంత వయస్సు వచ్చినా శరీర సుఖం కోసం పెళ్ళి ఎందుకు చేసుకోవాలనిపించటం లేదు?! అఫ్‌కోర్స్... శారీరక సుఖం కోసమే పెళ్ళి అని నేను అనను... మిగతా చాలా ప్రయోజనాలతో పాటు అది కూడా ప్రయోజనమే కదా!?"

"ఇష్టం లేదు అంకుల్."

"అదే ఎందుకు?"

"సారీ అంకుల్... ఆ విషయం డిస్కస్ చేయలేను... వస్తాను..."

◇◇◇

"ఏంట్రా... వీడు నాకేమీ అర్థమయి చావటం లేదు..." టేప్ రికార్డర్ విన్న తర్వాత ఆవేదనగా అడిగాను వేణుగోపాల్‌ని.

"వాడికి శారీరకంగా ఏమీ లోపం లేదు జీవన్... కేవలం మాటల్లోనే కాకుండా వేరే పరీక్షలు కొన్ని చేశాను. వాటితో పాటు కొన్ని అందమైన ఫోటోలు కూడా చూపించాను. వాడిలో మగవాడికి ఉండవలసిన స్పందన ఉంది. కాబట్టి ఆ విషయంలో నువ్వేమీ బెంబేలు పడనవసరం లేదు..." వేణుగోపాల్ అన్నాడు.

"మరి ఎలారా... వాడి పెళ్ళి చేయటం?" ఆవేదనగా అడిగాను.

"ఒరేయ్... అంతలా క్రిందా మీదా అయిపోకు... ప్రతిదానికి ఏదో పరిష్కారం ఉంటుంది... కొన్ని పరిష్కారాలు వెంటనే తెలుస్తాయి... కొన్ని ఆలస్యంగా..." నా భుజం ఆప్యాయంగా తడుతూ అన్నాడు వేణుగోపాల్.

ఇంటికి వచ్చిన తర్వాత నా భార్య నా మాటలు, క్యాసెట్ రెండూ విని "ఇక ఒకటే మిగిలి ఉన్నదండి... నేను చస్తానని బెదిరించటం..." అన్నది.

"వాడి కోసం చస్తావటే... నేనేం కావాలి?" సాధ్యమైనంత కూల్‌గా అన్నాను.

"అలాంటి ఆనందాలేమీ పెట్టుకోకండి... నేను చచ్చిపోయిన తర్వాత ఈస్ట్‌మన్ కలర్‌లో లైఫ్‌ని ఊహించుకోకండి. నేను ఊరికే బెదిరిస్తా... అంతే" మా ఆవిడ నవ్వుతూ అంది.

"అం... తే... నా..." అక్షరాల్ని నొక్కుతూ అన్నాను. మా ఆవిడ సుతారంగా తాకిన చెంపని తడుముకొంటూ...

◇◇◇

"ఒరేయ్... జీవన్." ఒక ఆదివారం ఉదయం జీవన్‌ని గట్టిగా పిలిచింది మా ఆవిడ. నేను పడక గదిలోనే ఉన్నాను. బయటికి రాలేదు. మా ఆవిడ ఆదేశాల మేరకు...

హాల్లోకి వచ్చాడు జీవన్. పావన్ లేదు. ఫ్రెండ్స్‌తో టూరుకి వెళ్ళాడు.

"ఒరేయ్ జీవన్... చెప్పి... చెప్పి... మాకు

# కవిత్వం నేర్చుకున్నదిలా

(కన్నడ మూలం: జి.ఎస్.శివరుద్రప్ప)

నా చిన్ననాటి జ్ఞాపకాల వీధిలో
ఇంకా తిరుగుతున్నది
మా వూరి కుమ్మరి సారె.
చక్రం మధ్యలో మట్టి ముద్ద-
కుమ్మరి గుండన్న వేళ్ళ స్పర్శతో
మట్టి లోపల నిద్రిస్తున్న ఆకృతులు
ఒక్కటొక్కటే కళ్ళు తెరుస్తుంటే
ఎడతెగని విస్మయం!
అసలు కవిత్వం ఎలా పుడుతుందో
నేను మొదట తెలుసుకున్నదిలా

నా చిన్ననాటి జ్ఞాపకాల మబ్బుల్లో
ఇంకా వినవస్తున్నవి
సాలెల మగ్గం చప్పుళ్ళు.
పద్మశాలి గంగన్న ముందు
పరచుకుని వున్న రంగురంగుల
నూలు దారాల్లోపల దారులు వెతుకుతున్న
జింక, చేపల డిజైన్లు
అదొక వస్త్ర ప్రపంచం!
ఛందస్సుతో పాటు
కవిత్వానికి అవసరమైన
మాటల్ని నేర్చుకున్నదిలా

నా చిన్ననాటి జ్ఞాపకాల్లో
ఇంకా ప్రకాశిస్తున్నవి
ఎర్రటి ఎండలో
ఈకలు పోయి ఇప్పుడో అప్పుడో
ఎగరడానికి సిద్ధమైనట్లున్న
అనేకానేక ఒంటికాలి పక్షుల్లాంటి కొబ్బరిచెట్లు
ఇక్కడి మట్టి అంతరాంతరాల్లో
లోతుగా వేళ్ళూనుకుని మొలకెత్తి
ఆకాశమంత ఎత్తుకెదిగి
నిటారుగా నిలుచున్న ఈ చెట్లు
నిత్యం పచ్చగా బతుకుతున్న కవితలు.

అనువాదం: నలిమెల భాస్కర్

విసుగు వచ్చింది. అయినా మా సహనానికి హద్దంటూ ఒకటుంది. ఆఖరుసారిగా అడుగుతున్నాను. నువ్వు పెళ్ళి చేసుకొంటావా లేదా?" మా ఆవిడ గట్టిగా అడిగింది.

"అమ్మా... ఇదేమన్నా కాశ్మీర్ సమస్యా?" మావాడు విషయాన్ని పక్కకి తప్పించాలని చూశాడు.

"ఒరేయ్... ఇవాళ ఆన్సరు స్ట్రెయిట్‌గా చెప్పు... ఎవర్నన్నా ప్రేమిస్తే చెప్పు... లేదా మేము చూపించిన అమ్మాయినన్నా చేసుకో... ఏదేమైనా నీ పెళ్ళి ఈ మాఘ మాసంలోనే జరగాలి. లేదా... నేను ఆత్మహత్య చేసుకొంటాను. ఈ బాధ భరించలేను? పక్కనే ఉన్న డబ్బాలో నుంచి కిరసనాయిల్ తన మీదకు వంచుకొంటూ మా ఆవిడ అన్నది.

"అమ్మా... అమ్మా... ఏంటిది?" మా జీవన్ కంగారుపడ్డాడు.

"వద్దు... నా దగ్గరకు రావద్దు... నా ప్రశ్నకు జవాబు చెప్పి నా దగ్గరకు రా..." అగ్గిపెట్టె చేతిలోకి తీసుకొంటూ అన్నది.

"అమ్మా... పెళ్ళి చేసుకొంటాను. నువ్వొక్కటి ఒప్పుకొంటే..." మావాడు స్థిరంగా అన్నాడు. నాలుగేళ్ళ నుంచి చేస్తున్న పోరాటానికి మంగళ వాయిద్యం జవాబు లభించే సరికి మా ఆవిడ ఆనందానికి అవధులు లేవు. ఒక్కుదుటున వాడి నుదుటి మీద ముద్దు పెట్టింది.

"నువ్వేది కోరితే అది ఒప్పుకొంటాను. ఉండు... ఇప్పుడే చీర మార్చుకొని వస్తాను..." అంటూ మా ఆవిడ మా బెడ్రూంలోకి వచ్చి, నావైపు విజయ గర్వంతో ఒక్క క్షణం చూసి నన్ను బయటికి తోసింది.

అయిదు నిమిషాల తర్వాత మేము ముగ్గురం రిలాక్స్‌డ్‌గా కూర్చున్న తర్వాత మావాడు సంభాషణ మొదలుపెట్టాడు.

"అమ్మా... నేను పెళ్ళి చేసుకోకపోవటానికి కారణం నువ్వే..." మా ఆవిడ స్టన్నయింది వాడి మాట విని. "అదేంట్రా... నేను... నీ పెళ్ళికి పోరాడుతున్నదాన్ని... నేను కారణమా?!" మా ఆవిడ కాసింత నిష్ఠూరంతో అంది.

"అవునమ్మా... నీ ప్రవర్తనే పెళ్ళి మీద నా ఇంట్రస్ట్‌ను పోగొట్టింది..."

"ఏం చేశాన్రా..." మా ఆవిడ ఆవేదనగా అడిగింది.

"గ్రాండ్ మాను... ఐ మీన్... మీ అత్తగారిని నువ్వు ట్రీట్ చేస్తున్న విధానం నాకు నచ్చలేదు. ఆవిడ చేసిన నేరమేమిటమ్మా... నాన్న ఒక్కడే కదా ఆమెకు కొడుకు... ఆవిడకి కొడుకుతో, కోడళ్ళతో, మనవళ్ళతో కలిసి ఉండాలని ఉండదా? భర్త లేని ఆవిడతో పోట్లాటలు పెట్టుకొని, ఆవిడ ఇంట్లో ఉండటానికి వీల్లేదని దిక్కులేని దానిలా అనాథ శరణాలయంలో చేర్పించావ్... ఆవిడ మనస్సు ఎంత బాధపడిందో నాకు తెలియదు కాని... నా మనస్సు మాత్రం చాలా గాయమైంది. రేపు నేను పెళ్ళి చేసుకొన్న తర్వాత నా భార్య కూడా... మీ అమ్మా, నాన్న ఇంట్లో ఉండకూడదు. వాళ్ళతో మనం కలిసి ఉండకూడదంటే... నేను ఏం చేయాలి? కాదన్నానంటే ప్రతిరోజు తగాదాలు. భార్యాభర్తలం విడిపోకుండా ఉండాలంటే తల్లిదండ్రులను విడిచివెయ్యాలి. ఇలా జరగటం మీకు దూరం కావడం ఇష్టం లేదు కనుక నేను పెళ్ళి చేసుకోనన్నాను. అయినా మీరు బలవంతం చేస్తున్నారు కనుక పెళ్ళి చేసుకుంటాను. అయితే నాన్నమ్మని వెంటనే మన ఇంట్లోకి తీసుకురావాలి. ప్రేమాభిమానాలతో అందరం చూసుకోవాలి. దీనికి నువ్వు ఒప్పుకుంటే నేను పెళ్ళి చేసుకొంటాను. కాబోయే నా భార్య కూడా అమ్మా, నాన్నల్ని నా నుంచి దూరం చేయదంటేనే పెళ్ళి చేసుకొంటాను" మావాడు గడగడా చెప్పి, ఒక్క నిమిషం ఆగాడు.

మా ఆవిడ కంటి నుంచి ధారాపాతంగా కన్నీళ్ళు...

"నాన్నా... నీ కడుపునే మేం పుట్టాల్సిందిరా... నన్ను క్షమించు... ఏమండి... అత్తయ్య గారిని ఇప్పుడే వెళ్ళి తెద్దామండి..." మా ఆవిడ మాటలు వింటూ జీవన్‌కేసి చూశాను. మానవత్వం లేని తండ్రి సమస్యని పరిష్కరించిన మానవత్వమున్న కొడుకు...

పుత్రోత్సాహము తండ్రికి... ■